ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేడు జెడ్‌పి సమావేశం

2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనున్న సభ్యులు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం గుంటూరులో జరగనుంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించనుండగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారు. వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటిపారుదల, పారిశుధ్యం, జిల్లా నీటి యాజమాన్యం, గృహనిర్మాణ సంస్థ, గనులు, భూగర్భ శాఖలకు సంబంధించిన అంశాలను ఏజెండాలో పొందుపర్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాల బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు.

వ్యవసాయానికి సంబంధించి ఈ ఏడాది రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పంటలకు ధరలు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారు. వరి, పత్తి, మిర్చి, శనగ, ఇతర అపరాలకు ఈ ఏడాది గత రెండేళ్లలో ఎన్నడూ లేనంతగా ధరలు పడిపోయాయి. వీటిపై రైతుల ఆందోళనను సభ్యులు ప్రస్తావించే అవకాశం ఉంది. పల్నాడు ప్రాంతంలో పంటలకు నీటి ఎద్దడి పెరిగింది. వారాబందీగా నీటి సరఫరా చేస్తున్నా ఖరీఫ్‌లో వేసిన మిర్చికి, రబీలో వేసిన జొన్న, మొక్కజొన్న, శనగ, ఇతర పంటలకు నీటి ఎద్దడి పెరిగింది. నాగార్జున సాగర్, పులిచింతలలో తగినంత నీరు ఉన్నా ఖరీఫ్‌లోనే ఎక్కువ నీటిని వినియోగించుకున్నారనే కారణంతో రబీలో నీటి విడుదల క్రమబద్ధీకరించినట్టు చెబుతున్నారు. డిసెంబరు రెండో వారం నుంచి ఇప్పటి వరకు తగిన వర్షాలు లేకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మిర్చి రైతులకు గత ఏడాది కనీస ధర రూ.18 వేలు, గరిష్ట ధర రూ.27 వేలు పలకగా ఈ ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13,500 పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పెట్టుబడులు పెరిగాయి. నల్లతామరతో దిగుబడి తగ్గింది. అయినా ధరలు పెరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. దిగుబడి లేక ధరలు తగ్గి ఇబ్బంది పడుతున్నారు. పత్తి కొనుగోలులో వ్యాపారాలు సిండికేట్ కావడం, సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో కొనకపోవడంతో రైతులు ఈఏడాది క్వింటాళ్ రూ.5500 నుంచి 6 వేల లోపు అమ్ముకున్నారు. కనీస మద్దతు ధర రూ.7521 రావాల్సి ఉండగా ఈ ధర అతి తక్కువ మందికి వచ్చింది. ఈ ఏడాది బర్లీ పొగాకు రైతులు కూడా ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీటిపారుదల రంగానికి సంబంధించి వరికపూడిశెలకు ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. గుంటూరు ఛానల్‌కు రూ.100 కోట్లు కేటాయించారు. ఈ నిధులు భూసేకరణకు వినియోగించాలని సూచించారు. నల్లమడ 2లో



గుంటూరులో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

చిత్తశుద్ధి ఉంటే గనులు కేటాయించాలి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని గుంటూరు, పల్నాడులో నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసనలు చేపట్టారు. గుంటూరులో సిఐటియు నగర 2లో

నరసరావుపేటలో నిరసన



స్నేహితుని ఇంటికని వచ్చి...

బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నం

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - మేడికొండూరు

స్నేహితుని కోసమని వెళ్లిన వృద్ధుడు ఒంటరిగా ఉన్న మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించగా బాలిక పెనుగులాడి తప్పించుకున్న ఘటన మండలంలోని పేరేచర్లలో శుక్రవారం జరిగింది. దీనిపై పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన 65 ఏళ్ల దేవరకొండ రామారావు అదే కాలనీలోని తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. ఇంటిలో బాలిక మాత్రమే ఉండడంతో లైంగిక దాడికి యత్నించాడు. అతనితో పెనుగులాడిన బాలిక పెద్దగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఇది తెలిసిన బాధితురాలు బంధువులు మేడికొండూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు.

జర్మనీలో గణపవరం యువకుడు మృతి 3లో

పిల్లల ప్రాణాలు తీసిన సరదా..

ముస్సాపురం, నంబూరులో నీట మునిగి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి - పెదకూరపాడు, పెదకాకాని

తెలిసీ తెలియని వయసులో పిల్లల సరదా వారి ప్రాణాలను తీయడంతోపాటు తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. పాఠశాలకు హోలీ సెలవు, వేసవి ఎండల నేపథ్యంలో చల్లదనం కోసం కాల్వల్లో దిగిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. పల్నాడు జిల్లా ముస్సాపురంలో ఒకరు, గుంటూరు జిల్లా నంబూరులో ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటలనపై పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం..






మహిధర్ మృతదేహం.. మృతుడు జాషువా (ఫైల్)

పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం ముస్సాపురం గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు పాటిబండ్ల ఆర్‌సిఎం హైస్కూలులో 7, 8 తరగతులు చదువుతున్నారు. హోలీ సందర్భంగా పాఠశాలకు శుక్రవారం సెలవు కావడంతో పాటిబండ్ల మహిధర్ (12)తోపాటు మరో ముగ్గురు పాడిబండ్ల కొండవైపు వాగులో ఈతకు వెళ్లారు. మహిధర్, మరొకరు కొంచెం లోతులోకి వెళ్లి మునిగిపోతూ కేకలు పెట్టారు. మిగతా ఇద్దరు ఇది గమనించి ఒడుకు వచ్చి బిగ్గరగా అరుస్తుండగా దగ్గర్లోని పశువుల కాపరులు విని అక్కడికి చేరుకున్నారు. ముగ్గుర్ని సురక్షితంగా బయటకు తెచ్చినా మహిధర్‌ను కాపాడలేకపోయారు. సిరిపురానికి చెందిన గజ ఈతగాళ్లను పిలిపించి మహిధర్ మృతదేహాన్ని వెలుపలికి తీశారు. మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. ఇదిలా ఉండగా 2లో

నేటి నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

పాఠశాలలకు శనివారం నుంచి వచ్చేనెల 24వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని గుంటూరు, పల్నాడు జిల్లాలల డిఇఒలు సి.వి రేణుక, ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వరకు స్కూల్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకూ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వచ్చే నెల 2వ శనివారం పాఠశాల నిర్వహించాలని, గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల సహకారంతో తాగునీరు అందించాలని పల్నాడు డిఇఒ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో/చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని, పాఠశాల ముగిసే సమయానికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజనంలో మజ్జిగ ఏర్పాటుకు హెచ్‌ఎంలు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒంటిపూట బడుల నిర్వహణలో నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.23 (శనివారం - సాయంత్రం)

సహార్ : 4.59 (ఆదివారం - ఉదయం)

నేడు జెడ్‌పి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

డ్రెయిన్ ఆధునీకీకరణ, రహదారుల అభివృద్ధికి నిధులు, మౌలిక వసతులు నిధులు కేటాయించాల్సి ఉంది. వేసవి తీవ్రత పెరుగుతోంది. ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇంత వరకు కార్యాచరణ ప్రణాళికలను అధికారులు విడుదల చేయలేదు. ఇప్పటికే వేడిగాలులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 170 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కానుంది. నాగార్జున సాగర్ ఆయకట్టులో ఈ సమస్య ఎక్కువగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ నిధులు సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్ల పలు పథకాలు అసంపూర్తిగా ఉన్నాయి. రాజధానికి సమీపంలోని పలు గ్రామాల్లో కూడా నీటి ఎద్దడి నెలకొంది. ఉపాధి హామీ పనులు చేసే కార్మికులకు తగిన వసతులు కల్పించడం లేదనే విమర్శలున్నాయి. ఆయా శాఖలకు సంబంధించి ఈ సమావేశానికి మూడు జిల్లాల అధికారులు హాజరుకానున్నారు.

పిల్లల ప్రాణాలు తీసిన సరదా..

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని గుంటూరు ఛానల్‌లో పడి మరో విద్యార్థి మృతి చెందాడు. స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన పొక్లెయినర్ డ్రైవర్ దాసరి ఏసురత్నం, సాంబమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా చిన్నవాడైన జాషువా (12) స్థానిక జెడ్‌పి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవు కావడంతో తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ పక్కనే ఉన్న గుంటూరు ఛానల్‌కు వెళ్లాడు. సరదాగా నీటిలో దిగుదామనే ప్రయత్నం చేస్తుండగా కాలుజారి కాల్వలో పడ్డాడు. తోటి చిన్నారులు పరుగున వెళ్లి స్థానికులకు చెప్పగా వారొచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే జాషువా మృతి చెందాడు.

పనిచేస్తూ జారిపడి పెయింటర్ మృతి

ప్రజాశక్తి - తెనాలి



ప్రమాదవశాత్తు జారిపడి పెయింటర్ మృతి చెందిన ఘటన చెంచుపేటలో జరిగింది. పాండురంగ పేటకు చెందిన కొండ్రు సాయికుమార్ (20) వృత్తి రీత్యా పెయింటర్. ఈ నేపథ్యంలో శుక్రవారం యథావిధిగా పనికి వెళ్లిన సాయి కుమార్ స్థానిక చెంచుపేటలో ఓ భవనంలో తాడుపై ఆధారపడి పెయింట్ వేస్తున్నాడు. తాడు తెగి మూడు అంతస్తుల నుంచి కింద పడి అక్కడక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సిమెంట్ బల్లల వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని పేరుతో 10 సిమెంటు బెంచీలను టిడిపి మండలఅధ్యక్షులు అర్తిమల్ల రమేష్ వితరణ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు తాగునీటి చెరువుపై మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని ఆధ్వర్యంలో రూపొందించిన నడక మార్గం ఐదేళ్ల వైసిపి పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రత్యేక చొరవతో నడక మార్గం ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో నడకకు వచ్చే వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా నళిని జ్ఞాపకార్థం ఆమె భర్త రమేష్ తన సొంత నిధులతో 10 సిమెంట్ బల్లలు సమకూర్చారు. వాటిని నడక మార్గంలోని పలు ప్రదేశాల్లో శుక్రవారం ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై నడక మార్గం అభివృద్ధికి కృషిచేసి మౌలిక వసతులు కల్పిస్తున్న రమేష్‌కు వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తశుద్ధి ఉంటే గనులు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ త్యాగాలు, ఆత్మబలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసేందుకు బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రయత్నిస్తుందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకమని ప్రకటనలు చేస్తున్న రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు విశాఖ ఉక్కు రక్షణకు ఎలాంటి కృషి చేయట్లేదన్నారు. విశాఖ ఉక్కుకు సొంత ముడిఖనిజం గనులు లేకపోవటం వల్ల, అధిక ధరలకు బయటి నుండి కొనుగోలు చేయాల్సి వస్తోందని, నష్టాలకు కారణం అవుతోందనివివరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని సిఎం చంద్రబాబు కేంద్రాన్ని అడగకుండా, ఇంకా ప్రారంభం కాని మిట్టల్ ప్రైవేటు ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని అడగటం అంటేనే ప్రభుత్వాల విధానం ఏంటో స్పష్టం అవుతోందని విమర్శించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం షుమారు రూ.11 వేల కోట్లు ఇచ్చినా అవి అప్పులు తీర్చటానికే ఉపయోగించాలని షరతులు పెట్టిందని, అప్పులు లేకుండా చేసిన తరువాత ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కూరపాటి కోటయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మొత్తం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయాలని చూస్తోందని విమర్శించారు. విఆర్‌ఎస్ పేరుతో ఉద్యోగుల్ని ఇంటికి పంపిస్తుందని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వట్లేదని అన్నారు. ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు మాట్లాడుతూ ఉద్యమాలతోనే ప్రైవేటీకరణను అడ్డుకోగలమన్నారు. ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాస్, జి.రమణ, చింతల శ్రీనివాసరావు, ఎఐటియుసి నాయకులు బుజ్జి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఎఐవైఎఫ్ నాయకులు జంగాల చైతన్య, ఐద్వా నాయకులు ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

నరసరావుపేటలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని ప్రైవేటు వారికి అప్పజెప్పే కుట్రలు సాగుతున్నాయని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని, కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఉక్కు శాఖ మంత్రి ప్లాంట్‌కు వచ్చిన సందర్భంగా చేసిన ప్రకటన ఉక్కు పరిశ్రమను కాపాడేలా లేదన్నారు. గనుల కేటాయింపుకు, నూతన యంత్రాల కొనుగోలుకు నిధులు వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కార్మికుల పట్ల నిరంకుశ విధానాలు విడనాడాలన్నారు. పిఎఫ్, ఎస్ఎబిఎఫ్, ఇతర అలవెన్సులు రూ.వెయ్యి కోట్లకు పైగా ఉన్న బకాయిలు చెల్లించాలన్నారు. రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ఆరేళ్ల నుండి విశాఖ ఉక్కు పరిశ్రమ కాపాడుకునేందుకు కార్మికులు పోరాడుతున్నారని, వారికి రైతుసంఘం పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. పరిశ్రమను కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, సిఐటియు నాయకులు డి.శివకుమారి, మల్లీశ్వరి, బాషా, ఎఐటియుసి నాయకులు వి.వెంకట్, యు.రంగయ్య, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

తాతల కాలం నుండి సాగు.. దక్కని పాస్ పుస్తకాలు

సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో ఎర్రబాలెం ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని ఎర్రబాలెం ఎస్సీ కాలనీలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. 14 కుటుబాలకు చెందిన దళితలం తాతల కాలం నుండి సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్లైన్ లేకపోవడం వల్ల సాగుకు అవసరరమైన పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తోందని వాపోయారు. అనంతరం సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ తాతల కాలం నాడు పట్టాలు పొందిన వారికి పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మురుగు కాల్వలు సరిగా తీయకపోవడం వల్ల దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నారని, లూథరన్ చర్చి వద్ద ఉన్న చేతి పంపుకి మరమ్మతులు చేయాలని అర్జీ పెట్టి 15 రోజులైనా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు జి.జోజప్ప పాల్గొన్నారు.



సిపిఎం బృందానికి సమస్యలు చెబుతున్న ఎస్సీలు

పికిల్ బాల్ కోర్టులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ



నగరంలోని గాయత్రి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ది పికిల్ బాల్ కోర్టులను శుక్రవారం సాయంత్రం పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పికిల్ బాల్ క్రీడపై యువకులు విపరీతంగా ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇలాంటి ఎన్నో అకాడమీలు అందుబాటులోకి రావాలని తెలిపారు. అమరావతిలో రాబోయే రోజుల్లో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతున్నాయని తెలిపారు. అమరావతి స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం కూడా జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బాదంతో చక్కని ఆరోగ్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

మనం తినే ఆహారంలో రెగ్యులర్ గా బాదం తీసుకోవడం వలన చక్కటి ఆరోగ్యం ఉంటుందని ప్రముఖ హెల్త్ కేర్ నిపుణులు రితిక అన్నారు: నగరంలోని ఓ హెూటల్ నందు, పోషకాహారం అనే అంశంపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమతుల్యతను సాధించడానికి ఒక సులభమైన మార్గంగా కాలిఫోర్నియా బాదంను వినియోగించుకోవచ్చని అన్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం సహజంగా ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది, అన్నారు. ఇవి సాంప్రదాయ వంటకాలకు ఆరోగ్యకరమైన జోడింపుగా ఉంటాయి అని,. బాదం పప్పును తండైలో కలిపినా, స్వీట్ల మీద చల్లినా, లేదా కాల్చిన స్నాక్‌గా తిన్నా, రుచి, ఆకతి రెండింటినీ పెంచుతాయి అని తెలిపారు.



వర్సిటీలో జనసేన ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జనసేన ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ముఖద్వారం దగ్గర భారీ కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూజి పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ యన్‌వి కృష్ణరావు, జనసేన ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు తోట వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పొత్తూరి నాగరాజు, విశ్వవిద్యాలయ వికాస అధ్యక్షులు నీలపు ప్రసాదు, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావులతో పాటు జనసేన విద్యార్థి విభాగం అధ్యక్షులు జగదీష్ నాయుడు, నితీష్ కుమార్ యాదవ్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జెడ్‌పి పాఠశాలలో కాలియోగ్రఫీ తరగతులు

ప్రజాశక్తి - క్రోసూరు : ఇంగ్లీషు చేతిరాత మెరుగు పరచడానికి గాను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో శుక్రవారం క్రోసూరు, అచ్చంపేట మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రముఖ కాలియోగ్రఫి నిపుణులు ఉప్పాల రామ్మోహన్‌రావు, నాగమణి, జగదీష్‌బాబు, ప్రియాంక శిక్షణిచ్చారు. ఉపాధ్యాయులు టి.శరత్ కుమార్, పి.పిచ్చయ్య పర్యవేక్షించారు.

5న పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి, పెదకూరపాడు మండలం యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు సమావేశం వచ్చేనెల 5న అమరావతిలోని యోగాశ్రయంలో ఉంటుందని అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట యూనిట్ జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి యూనిట్‌లోని సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఫలితాల్లో ఉత్తమ ఉత్తీర్ణతకు కృషి- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అక్షరాస్యత శాతం పెంపునకు ప్రణాళికలు : పల్నాడు డిఇఒ ఎల్.చంద్రకళ



ఈ నెల 17 నుండి జరగనున్న వచ్చే నెల 1వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి ఫలితాలలో పల్నాడు జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ కసరత్తు పూర్తి చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు కషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధి కారిణి ఎల్ చంద్రకళ స్పష్టం చేశారు. ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రణాళికతో ముందుకువెళ్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షలలో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. 10వ పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధన తదితర అంశాలపై శుక్రవారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలను ఎంత మంది విద్యార్థులు రాస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 463 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 26497 మంది విద్యార్థులు 10 వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో 13415 మంది బాలురు, 13,042 మంది బాలికలు ఉన్నారు. అదేవిధంగా ఓపెన్ 10వ తరగతి పరీక్షలు 27 పరీక్ష కేంద్రాలలో 1200 మంది విద్యార్థులు రాస్తున్నారు. విద్యా ర్థులు సెల్ నెం.9552300009 నెం. ద్వారా హాల్ టికెట్లను ఇంట్లో ఉండే డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కల్పించడం జరిగింది.

నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా 60 ప్రభుత్వ పాఠశాలలు, 68 ప్రయివేటు విద్యా సంస్థలు మొత్తం 128 పరీక్షా కేంద్రాలలో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఇందుకోసం ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమావేశం నిర్వహించి నిర్వహణపై సూచ నలు, సలహాలను ఇచ్చాం. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశాం.



మెరుగైన ఫలితాల సాధనకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

ఫలితాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ప్రతి రోజు మండల స్థాయి విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణతో 100 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా సిలబస్ సకాలంలో పూర్తి చేయడం, ప్రీఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా పాఠ శాల విద్యార్థుల స్థాయిని అంచనా వేసి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా మార్గనిర్దేశం చేశాం. విద్యా ర్థులు ఎలా చదువుతున్నారో నిత్యం ఉపాధ్యాయుల ద్వారా పురోగతి తెలుసుకుని విద్యార్థి సామర్థ్యం మెరుగుపరిచాం.

పరీక్షా కేంద్రాలలో సౌకర్యాల గురించి ?

ఇప్పటికే గుర్తించిన పరీక్షా కేంద్రాలలో మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేశాం. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాం త్రాగునీరు, నిరంతరం విద్యుత్ సరఫరా ,ఎండ తీవ్రత దష్ట్యా ప్రాథమిక చికిత్సకై అందుబాటులో వైద్య సిబ్బందిని నియమించాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఏర్పాటు తదితర మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉంది. ఆయా సదుపాయాల కల్పనకు శాఖల వారీగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరిగింది.

జిల్లాలో ఎన్ని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు?

జిల్లా వ్యాప్తంగా 6 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకర భారతిపురం జిల్లా పరిషత్ హై స్కూల్, బొల్లాపల్లి మండలం బండ్లమోటు, రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం, కారంపూడి, క్రోసూరు, విపి సౌత్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లను గుర్తించాము. ఆయా పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశాం.

పరీక్షల విధులలో ఎంతమంది స్క్వాడ్ బందాలు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాలలో 1650 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్ వీరితో పాటు పరీక్ష విధానాన్ని పరిశీలించేందుకు 280 మంది చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు. వీరితో పాటు ఆయా పరిధిలోని రెవెన్యూ అధికారులు, పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎస్.ఎస్.సి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం ఏమైనా సమస్యలు తలెత్తితే విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు సెల్ నెంబర్ 8341135357 సంప్రదించి పరిష్కరించుకోవచ్చు.

గత ఏడాది ఉత్తీర్ణత శాతం ఎంత? ఈ ఏడాది ఎలాంటి ఫలితాలు అంచానా వేస్తున్నారు?

గత ఏడాది 86.3 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 18 స్థానంలో పల్నాడు జిల్లా నిలిచింది. జిల్లాలో అక్షరాస్యత శాతం గతం కంటే పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. పల్నాడు జిల్లాలో అక్షరాస్యత శాతం 86.05 శాతంగా ఉంది. రానున్న విద్యా సంవత్సరంలో 90 శాతం అక్షరాస్యత సాధనకు కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జర్మనీలో గణపవరం యువకుడు మృతి

7వ తేదీన చోటుచేసుకున్న ఘటన - నేడు గ్రామానికి భౌతికకాయం

ప్రజాశక్తి - నాదెండ్ల

గణపవరం గ్రామానికి చెందిన యువకుడు జర్మనీలో మృతి చెందిన సంఘటనతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గణపురం గ్రామానికి చెందిన కాట్రు అశోక్ చంద్రకుమార్ (45) జర్మనీలో ఏడాది నుండి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అశోక్ చంద్ర కుమార్ డిగ్రీ వరకు స్థానికంగా పూర్తి చేసి లండన్‌లో మైక్రో బయాలజీ పీహెచ్డీ పూర్తి చేశారు. అప్పటినుండి హైదరాబాదులో సాఫ్ట్వేర్ కంపెనీలో పనిచేశారు. 2011లో పొన్నూరు సమీపంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన శిరీషతో వివాహం అయింది. వీరికి మూడో తరగతి చదువుతున్న ఎనిమిది సంవత్సరాల కుమార్తె ఉంది. ఏడాది క్రితం కంపెనీ పనులపై లండన్ కు అశోక్ కుమార్ వెళ్లాడు ఇటీవల జర్మనీకి వెళ్లి ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్నాడు. ఈనెల ఏడో తేదీన ఉద్యోగానికి వెళ్ళగా గుండెపోటుకు గురయ్యాడని, స్నేహితుల సహాయంతో ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామం గణపవరంకు తరలిస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-ఈపూరు

వివాహిత వెంటపడుతూ వేధిస్తున్న యువకుడి పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం వినుకొండకు చెందిన కుందుర్తి హరికృష్ణ దంపతులు మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో ఓ షాపు అద్దెకు తీసుకొని సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన గుంటకల లక్ష్మీనారాయణ హరికృష్ణ దంపతులకు దగ్గరగా ఉంటూ సూపర్ మార్కెట్ పనులలో చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా ఒంటరిగా షాపులో ఉన్న హరికృష్ణ భార్యను లక్ష్మీనారాయణ వేధించటం మొదలుపెట్టాడు. గురువారం ఆమె ఆటోలో వినుకొండకు వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై లక్ష్మీనారాయణ వెంబడించి వేధించడంతో ఆమె ఫిర్యాదు మేరకు లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే దేశాభివృద్ధి

ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

అట్టడుగు వర్గాల అభ్యున్నతే నిజమైన దేశాభివృద్ధి అని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి కాశీం అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ బాబూ జగ్జీవన్‌రామ్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమయ్యింది. ప్రారంభోత్సవ సభలో ఆచార్య సి కాశీం మాట్లాడుతు జీవితాంతం ఆత్మగౌరవం, ఆలోచనాత్మకంగా ముందుకు సాగిన ప్రత్యేకత జగ్జీవన్‌రామ్ సొంతమన్నారు. తన వర్గం, దేశ ప్రయోజనాలు దెబ్బతింటున్నపుడు తాను ఉన్న పార్టీ, ప్రభుత్వాన్ని సైతం వ్యతిరేకించి తన ప్రయోజనాలను సైతం వదులుకున్న ధీశాలి జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ దేశంలో అణగారిన వర్గాల సంపూర్ణ సాధికారితలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విభిన్న సిద్దాంతాలు, ఆలోచనాత్మక ధోరణితో ముందుకుసాగినప్పటికీ వారి లక్ష్యం ఒక్కటేనన్నారు. మన జాతి నిర్మాణంలో జగ్జీవన్‌రామ్ పాత్ర నేటికీ ఆదర్శనీయమేనని స్పష్టం చేశారు. మన ఆలోచనా విధానం సరిగా లేకపోతే మనం ఎంత చదివినా వ్యర్థమేనని తెలిపారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కమిషనర్ బి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశ పాలన, రాజ్యాంగం అమలు వంటి అంశాలకు ఆదర్శంతమైన బాటలు వేసి మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌మార్ అన్నారు. ఆయన విజ్ఞానం మేథస్సును నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎస్ సరళా వందనం ప్రసంగిస్తూ క్రమశిక్షణకు జగ్జీవన్‌రామ్ ప్రతిబింబమన్నారు. కేంద్రంలో అన్ని శాఖలూ ఆదర్శవంతంగా నిర్వహించడంతోపాటు నేటికీ దేశం సుభిక్షంగా ఉండే అన్ని సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులు ఆయన సేవలను బహిరంగంగా కొనియాడటమే ఆయన మేధస్సుకు నిదర్శనమన్నారు. విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి ఎ భరత్‌భూషణ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ఎంతో మంది అణగారిన వర్గాల వారిని జాతీయ స్థాయి నాయకులుగా బాబూ జగ్జీవన్‌రామ్ తీర్చిదిద్దారన్నారు. స్వాతంత్ర్యా నంతరం భారత జాతి నిర్మాణంలో జగ్జీవన్‌రామ్ పాత్ర ఎంతో కీలకమన్నారు. వీసీ ఆచార్య కె గంగాధరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రస్తుతం మనం అనుభవిస్తున్న అనేక ప్రయోజనాలు, పొందుతున్న ఫలాలకు పునాదులు బాబూ జగ్జీవన్‌రామ్ నాయకత్వంతో రూపొందినవేనన్నారు. కేంద్రంలో అనేక శాఖలకు మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ ఆదర్శవంతమైన సంస్కరణలు ప్రవేశ పెట్టారని అవే నేటికీ కొనసాగుతున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ విజ్ఞానం, సమయస్ఫూర్తి విషయంలో నేటి యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కావలి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ యూనివర్సిటీ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ జగ్జీవన్‌రామ్ భారత జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ సదస్సు నివేదిక సమర్పించారు. దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 128 పరిశోధనా పత్రాలు సదస్సులో సమర్పిస్తున్నారని తెలిపారు. ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం సురేష్ కుమార్, అంబేద్కర్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య వై అశోక్ కుమార్, ఆచార్య ఎం త్రిమూర్తిరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ పసునూరి రవీందర్, నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుధాకర్ ప్రసంగించారు. పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.



రూ.వందల నుండి వేలల్లోకి కరెంటు బిల్లులు

- భారాలు తగ్గించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద 18న ధర్నా
- జయప్రదానికి సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి


ప్రజాచైతన్య యాత్రలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 18న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల పిలుపునిచ్చారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఫణిదం చేనేత సొసైటీ ఏరియాలో జరిగింది. విమల మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని ఎన్నికలప్పుడు చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు రూ.18 వేల కోట్ల భారాలను ప్రజలపై మోపారని, నమ్మి ఓటేసిన ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. గతంలో రూ.వందల్లో వచ్చే విద్యుత్ బిల్లులు నేడు వేలల్లో వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోయి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పేదలతోపాటు సామాన్యులకూ కష్టాలు వచ్చి పడ్డాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.శివదుర్గారావు, జి.యేసు, జి.శ్రీను, కె.రమాదేవి, జె.రాజ్ కుమార్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సింగర చెరువును సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ అధికారులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. పట్టణానికి నీరు సరఫరా చేసే సింగర చెరువును ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించారు. అధికారుల పర్యవేక్షణ పెరగాలని, నీరు వృథా కాకుండా చూడాలని చెప్పారు. ప్రతిరోజు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న పల్నాడు డిఇఒ తదితరులు

గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - మాచర్ల

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (APREIS)ఆధ్వర్యంలో నిర్వహించే గురుకుల పాఠశాలలలో 5వ తరగతి (APRSCA), గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, గురుకుల డిగ్రీ కళాశాల, నాగార్జున సాగర్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశపరీక్షల APRJC&DC CET ప్రకటన పత్రికను పల్నాడు జిల్లా విద్యా శాఖధికారి చంద్రకళ ద్వారా APRJC &DC CET జిల్లా కన్వీనర్ సరోజినీదేవి శుక్రవారం విడుదల చేయించారు. ప్రవేశ పరీక్ష పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వివిధ కేంద్రాల్లో వచ్చేనెల 25 తేదీన జరుగుతుందని తెలిపారు.

దర్శి శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామానికి చెందిన లెక్చరర్ దర్శి శ్రీనివాసరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం - గుంటూరు జిల్లా పరిధిలో నిరుద్యోగం - యువతపై ప్రభావం' అంశంపై డాక్టర్ ఎన్.సంజీవరావు పర్యవేక్షణలో పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకు అర్థశాస్త్ర విభాగాధిపతి కె.మధుబాబు నుండి డాక్టరేట్‌ను శుక్రవారం అందుకున్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ వేధింపులకు అధికారుల సహకారం

స్వస్థి పలకాలని సిఐటియు డిమాండ్ - తాజా ఘటనలపై అధికారులకు వినతి

ప్రజాశక్తి - క్రోసూరు


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్కీం వర్కర్లు, చిరుద్యోగులైన అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, వివోఎ (యానిమేటర్లు) తదితర వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు పల్నాడు జిల్లా నాయకులు జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తీవ్రంగా ఉంటున్నాయన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా వేధింపులు సాధారణమయ్యాయని చెప్పారు. వేధింపులు తట్టుకోలేక అమరావతి మండలం ఉంగుటూరు గ్రామంలో ఆశ వర్కర్ రాయపాటి సామ్రాజ్యం ఆత్మహత్యాయత్నం చేయగా, నకరికల్లు మండలం పాపిశెట్టిపాలేనికి చెందిన అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. రాజకీయ నాయకులు వేధింపులకు అధికారులు అనుకూలంగా వ్యవహరించడం మరింత దారుణమన్నారు. వీటికి ఇకనైనా స్వస్థి పలకాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు బి.జయలక్ష్మి, జి.శివపార్వతి, శ్యామల కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు టి.హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



గృహ విద్యుత్ వినియోగంలో అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని రొంపిచర్ల మండల విద్యుత్ శాఖ ఏఇ రాంబాబు సూచించారు. గృహ వినియోగానికి సంబంధించి మొదట ఒక కిలో వాట్ లోడ్ మాత్రమే కనెక్షన్ తీసుకుంటారని, ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్ వాడే క్రమంలో విద్యుత్ వినియోగం రెండు, మూడు కిలోవాట్‌కు పెరుగుతుందని అన్నారు. వినియోగదారులు విద్యుల్ బిల్లులు చెల్లిస్తున్నా ట్రాన్సఫార్మర్ లోడు పెరిగి, కాలిపోవడం, లో ఓల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు తలెత్తుతాయన్నారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరిస్తే ట్రాన్స్ఫర్మర్ సామర్థ్యంపై పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన రుసుంలో 50 శాతం రాయితీ పోను ఒక కిలోవాట్‌కు రూ.1250, 2 కిలోవాట్ రూ.2,450, 3 కిలో వాట్‌కు రూ.3,650, 4 కిలోవాట్ రూ.4,850, 5 కిలోవాట్ రూ.6,050 చొప్పున చెల్లించాలన్నారు. జూన్ 30వ తేదీలోగా గ్రామ సచివాలయాలలో, మీ-సేవా కేంద్రాల్లో లేదా w.w.w.apcpdcl.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి - నాదెండ్ల

స్థానిక జెడ్‌పి పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారావు వివిధ అంశాలపై వివరించారు. చదువు అనే గొప్ప విలువైన సంపద ద్వారా పేదరికాన్ని జయించవచ్చని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వ్యక్తిగత గౌరవం, గుర్తింపు పొందవచ్చని చెప్పారు. నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నైపుణ్యాలు, మానవ వనరులు దేశానికి విలువైన సంపదని చెప్పారు. ఒక లక్ష్యం పెట్టుకోవాలని, శ్రద్ధగా చదివి ఎంచుకున్న రంగాల్లో రాణించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దుర్గా దేవి పాల్గొన్నారు.

వెల్దుర్తిలో నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - వెల్దుర్తి

మాచర్ల నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శనివారం మండలకేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ప్రజల నుంచి సమస్యల వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు మీ సమస్యలను వినతి పత్రంపై రాసి తీసు కొని రావలసిందిగా కోరారు. సమస్యకు సంబంధించిన అర్జీతోపాటు ఆధార్ జిరాక్స్, ఫోన్‌నెంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

ఏడాదంతా పంటలుంటే భూ సారం వృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రకృతి వ్యవసాయ 2025 వార్షిక కార్యాచరణ ప్రణాళికలో రైతులను భాగస్వామ్యం చేయాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) కె.అమలకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసరావుపేటలో ఇస్తున్న మూడ్రోజుల శిక్షణలో భాగంగా రెండోరోజైన శుక్రవారం కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ వైస్‌చైర్మన్ టి.విజయ్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. ఖరీఫ్ వార్షిక ప్రణాళిక, సార్వత్రిక సూత్రాలు, పలు జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న పంటలు, రైతుల విజయాలను వివరించారు. అనంతరం అమలకుమారి మాట్లాడుతూ విఎఎ, సర్పంచ్, గ్రామ సమైక్య సంఘం సభ్యులతో కలిసి ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహించాలన్నారు. నవధాన్యాల సాగు భూమికి బాగు అంటూ మార్చి, ఏప్రిల్, మే, నెలల్లో పిఎండిఎస్ పద్ధతిలో సాగు చేయాలన్నారు. ప్రధాన పంటలో కలుపు నివారణ, భూమిలో కర్బన శాతం పెరుగుదల భూమిలో సూక్ష్మ పోషకాలు వృద్ధి నవ ధాన్యాల సాగుతో సాకారం అవుతాయన్నారు. 365 రోజులు భూమిలో పచ్చదనం ఉండేలా చూస్తే భూమి సారం పెరిగి చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. శిక్షణలో అదనపు డిపిఎం ప్రేమ్‌రాజు, స్టేట్ ట్రైనర్ (ఎన్ఎఫ్ఎ) శాంతి, పల్నాడు జిల్లా ట్రైనర్ సైదయ్య, ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య, మేరీ, స్వాతి పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని కూటమి హామీలు

గ్రామాల్లో సమస్యలపై సిపిఎం బృందానికి అడుగడుగునా విన్నపాలు

పూడ్చిన చోటే పూడ్చడంతో మృతదేహాల ఎముకలు బయటకు వస్తున్నాయి

బేతపూడి హరిదాసు కాలనీ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సిపిఎం ప్రజాచైతన్య యాత్రకు ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల నాయకులు మస్తాన్ వలి, వై నాగేశ్వరరావు బృంద సభ్యులు ఫిరంగిపురం మండ లంలో బేతపూడి, గుండాలపాడు గ్రామాల్లో పర్యటించారు. బేతపూడి హరిదాసుల కాలనీ వాసులు మాట్లాడుతు 100 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, మంచినీటి ట్యాంకు ఉన్నప్పటికీ ఐదు, పది నిమిషాలు తప్ప నీరు రావడం లేదన్నారు. రోడ్లు, డ్రెనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని, కొద్దిపాటి వర్షానికి నీరు ఇళ్లల్లోకి వస్తుందని ఆ నీటిలో నడవలేని పరిస్థితి ఉంటుందని పిల్లలు ,ముసలివాళ్లు వర్షం వస్తే రోడ్డు లేక గుంటలో పడిపోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన స్థలం లేక రోడ్డు పక్కనే చనిపోయిన వారిని పూడ్చిపెడుతున్నామని పూడ్చిన చోటే పూడడం వల్ల ఎముకలు బయటపడుతున్నాయని తెలిపారు .ఎన్ని ప్రభుత్వాలు వచ్చినప్పటికీ స్మశాన స్థలం సమస్యను పరిష్కారం చేయలేదని తెలిపారు .గత ప్రభుత్వం స్మశాన స్థలం కోసం సర్వే చేయించి అంతా అయిపోయిందని చెప్పారని ప్రభుత్వం మారిన తర్వాత ఆ స్మశానస్థలం ఎక్కడో కూడా తెలియని పరిస్థితి ఉందని నాయకుల దగ్గర వాపోయారు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ అక్కడ ఇల్లు నిర్మించుకోవడానికి ఆస్కారం లేకుండా ఉందని తెలిపారు. ఆరు ఎకరాల చెరువు నిరుపయోగంగా ఉందని దానిని పేద ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. గుండాలపాడు లోని అగ్రహారంలో హరిదాసు కాలనీ వాసులు 100 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని వీరికి 30 సంవత్సరాల క్రితం ఇల్లు కట్టించారని ఆ ఇంటికి సంబంధించిన ఎటువంటి కాగితాలు వారి దగ్గర లేవని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి ఇంటికి సంబంధించిన పట్టాలను ఇవ్వాలని, ఇళ్ల పట్టాలు లేకపోయేటప్పుడికి బ్యాంకు లోన్లు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . కాలనీలో మంచినీటి బావి శుభ్రం చేసి పూడిక తీయించాలని ,బావి చుట్టూ గచ్చువేసి గిలకలు నిర్మించాలని వారు కోరారు. అలాగే గుండాలపాడు లో కూడా స్మశాన స్థలం లేదని అనేక ఇబ్బందులు పడుతున్నామని వర్షం వచ్చినప్పుడు రోడ్డు పక్కన చనిపోయిన వారిని పూడ్చి పెట్టాలంటే దయనీయమైన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా వెనకబడి ఉండటం వల్ల ఏ ప్రభుత్వాలు వచ్చినా మమ్మల్ని పట్టించుకోవడంలేదని నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర



ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని చెప్పిందని, ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తయినప్పటికీ సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామని వాగ్దానం చేసి ఆచరణలో ఇంతవరకు అమలు చేయలేదని ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేదానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు దీనిలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



దుగ్గిరాలలో

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాల లోని చెన్నకేశవ కాలనీలో ప్రజలు అనేక సమస్యలను సిపిఎం నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. గత 20, 30 సంవత్సరాలుగా చెన్నకేశవ కాలనీలో నివాసం ఉంటున్నామని డ్రైనేజీ వ్యవస్థ లేదని దీంతో మురుగు పేరుకుపోయి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు .అలాగే మాకు నివాసం ఉంటున్న చోటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కాలనీలో కుక్కల బెడద విపరీతంగా ఉందని పిల్లలు ప్రజలు భయబ్రాంతులకు గురి కావాల్సిన పరిస్థితి వస్తుందని ఎప్పుడు కరుస్తాయో తెలియటం లేదని కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనులు s 150 రోజులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు నాయకులు జెట్టి బాలరాజు, సిహెచ్ .శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జొన్నలగడ్డలో ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

శివారు కాలనీల్లో సమస్యలు కోకొల్లలు

జొన్నలగడ్డలో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో శుక్రవారం సిపియం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఎస్సీ, బిసి కాలనీల్లో నాయకులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, మంచినీటి చెరువులో పూడిక, నాచు, మురుగుతో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించి మంచినీటి సరఫరా చేయాలని నాయకులు కోరారు. అలాగే కౌలు రైతులుకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు ఏవీ అందట్లేదని వాపోయారు. ఈప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్, మండల శాఖ కార్యదర్శి చింతల భాస్కరరావు, గ్రామకార్యదర్శి ఇమ్మడి రామారావు, పార్టీ సభ్యులు జొన్నల కోటిరెడ్డి, ఇమ్మడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

ప్రజాశక్తి-గుంటూరు: శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర కమిటీ సభ్యులు తాడిబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా పాత గుంటూరు 3వ డివిజన్లో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాత గుంటూరు లక్ష్మీనగర్ ఏర్పడి మూడు దశాబ్దాలు అయినా కనీస మౌలిక వసతులు కల్పనలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. 3వ లైన్ నుంచి 6వ లైన్ వరకు రోడ్లు లేవని స్థానికులు



పాతగుంటూరు లక్ష్మీనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

వాపోయారని, తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. దోమల సమస్య తీవ్రంగా ఉందని నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పారిశుధ్యం పనులు మెరుగ్గా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గ్యాస్ సబ్సిడీ వేయడంలేదని మహిళలు తెలియజేశారన్నారు. తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేయాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సిపిఎం పాతగుంటూరు శాఖ కార్యదర్శి శనగపల్లి కార్తీక్, నాయకులు మైలా ముత్యాలరావు, వాస్తవ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వరగానిలో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని వరగాని, పెదనందిపాడు గ్రామాలలో సిపిఎం పెదనందిపాడు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలను శుక్రవారం నిర్వహించారు. వరగాని లో కోయ కులానికి చెందిన సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వారు సిపిఎం బృందంతో మాట్లాడుతూ తమ కులాన్ని గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీలలో గాని, బీసీలలో గాని ఎందులోనూ తమను కలపకపోవడం వల్ల అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తమ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, అర్హులైన వారికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉపాధి పనులు అడిగినా కూడా తమ పేర్లు నమోదు చేసుకోవడం లేదని, ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పెదనందిపాడు లో భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతు వారంలో రెండు, మూడు రోజులు కన్నా పని ఉండటం లేదని, కుటుంబాల పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. నాగులపాడు ఎస్సీ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల, అవి నిరుపయోగంగా ఉన్నాయని, ప్రభుత్వమే తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.



వెంకటపాలెంలో కళ్యాణ ఉత్సవానికి బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తుళ్లూరు మండలం వెంకటపాలెంలో శనివారం జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణ ఉత్సవానికి సిఎం చంద్రబాబు నాయుడు, పలువురు విఐపిలు హాజరుఅవుతున్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ తెలిపారు. మొత్తం వెయ్యి మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. వెంకటపాలెం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేసి, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గాని, ట్రాఫిక్ సమస్యలు గానీ తలెత్తకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు నిర్వహించాలని ఎస్పి సూచించారు. బందోబస్తు నిర్వహణకు వీలుగా సభా ప్రాంగణాన్ని సెక్టార్లుగా విభజించి, ప్రతి ఒక్క సెక్టార్కు అదనపు ఎస్పీ లేదా డిఎస్పీ స్థాయి అధికారులను ఇంచార్జీలుగా(బాధ్యులుగా) నియమించి వారికి సహాయకులుగా సీఐలను, ఎస్‌ఐలను పోలీస్ సిబ్బందిని కేటాయించారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రముఖులు, భక్తులు, సందర్శకుల వాహనాలకు సంబంధించి ప్రత్యేకమైన పార్కింగ్ ప్రదేశాలను కేటాయించామన్నారు. వాహనాల ట్రాఫిక్ సక్రమంగా నడవడానికి అందరూ సమిష్టిగా విధులు నిర్వహిస్తూ, ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలి. భక్తుల రద్దీ దష్ట్యా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ క్యూలైన్ల వద్ద, వాహనాల రాకపోకల మార్గాల్లో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. పలువురు అదనపు ఎస్‌పిలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.



పెంచిన మెనూ ఛార్జీలు త్వరలో అమలు : డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పెంచిన మెనూ ఛార్జీలు గతంలో త్వరలో అమలవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలపై ప్రజాశక్తిలో శుక్రవారం ప్రచురించిన వార్తపై డిఇఒ వివరణ తెలిపారు. భోజనం నాణ్యతలో ఎక్కడా రాజీ లేదన్నారు. అలాగే ఏజెన్సీ వారికి ఎటువంటి బిల్లులు పెండింగ్‌లో లేవని తెలిపారు.

అన్నదాన సత్రం, ఆశ్రమాన్ని కూల్చడం అన్యాయం : ఆవాజ్

ప్రజాశక్తి-గుంటూరు

కడప జిల్లా, బద్వేల్ నియోజకవర్గం కాశీనాయన మండలం లోని కాశీనాయన జ్యోతి క్షేత్రం ఆశ్రమాన్ని, అన్నదాన సత్రాన్ని కూటమి ప్రభుత్వం కూల్చడం అన్యాయం అని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి ఒక ప్రకటనలో అన్నారు. 45 ఏళ్లగా కులమతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్న ఈ ఆశ్రమం కూల్చడం దుర్మార్గమని అన్నారు. దేవా దాయ శాఖ మంత్రి రామ్‌నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు టైగర్ జోన్ పరిధి అనడాన్ని ఆ టైగర్లు అదానీ, అంబానీలా అని ప్రశ్నిం చారు. టైగర్ జోన్ పరిధి సాకుతో ఆశ్రమాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అక్కడ ఉన్నటువంటి ఖనిజ నిక్షేపాలను కట్ట బెట్టే కుట్ర దాగి ఉందని అన్నారు. మేమే హిందూ ధర్మ పరి రక్షకులమని మాట్లాడే హిందుత్వ శక్తులు ఇప్పుడెందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్ట నివారణ చర్యలుగా ఆశ్రమాన్ని పున నిర్మించాలని డిమాండ్ చేశారు.

రోజువారీ వేతనంపై పారిశుధ్య కార్మికులు కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు చేయడానికి రోజువారీ వేతనంపై కార్మికులు అవసరమని, ఆసక్తి ఉన్న వారు గుంటూరు నగరపాలక సంస్థ పధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌లో నేరుగానీ లేదా 08632345103 కి ఫోన్ చేసి, తమ వివరాలు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దుకోవాడానికి మెరుగైన పారిశుధ్య పనుల కోసం ప్రస్తుతం ఉన్న కార్మికులకు అదనంగా కార్మికులు అవసరమన్నారు. కనుక రోజువారీ వేతనంపై కేటాయించిన ప్రాంతాల్లో కేటాయించిన పారిశుధ్య పనులు చేయడానికి ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వార్డుల వారీగా చెత్త తరలించడానికి 15 రోజులకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు అవసరమని ఆసక్తి కల్గిన ట్రాక్టర్ యజమానులు సంప్రదించాలన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు డిసెంబర్ జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ మీటర్ రీడర్లకు డిసెంబర్ జీతాలు వెంటనే చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు బి. లక్ష్మణరావు ఒక ప్రకటనలో కోరారు. మీటర్ రీడర్లకు సంబంధించిన డిసెంబర్ నెల జీతాలు ఇంత వరకూ కాంట్రాక్టర్లు చెల్లించ లేదన్నారు. తక్షణమే అధికారులు బాధ్యత తీసుకొని డిసెంబర్ నెల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.డిసెంబర్ జీతంపై అధికారులు అలసత్వం వహించటం అన్యాయం అన్నారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కిడ్నీ వ్యాధులపై రేపు ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఆరోగ్య సభలలో భాగంగా ఈనెల 16న కిడ్నీ సంబంధిత వ్యాధులపై స్థానిక అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రముఖ యూరాలజిస్ట్ పెంట్యాల శ్రీకాంత్ పాల్గొని కిడ్నీ యూరిన్ ఇన్‌ఫెక్షన్లు, కిడ్నీ, యూరిటర్, బ్లాడర్‌లో రాళ్లు తొలగించటం, కిడ్నీ యూరేటర్, బ్లాడర్‌లో కేన్సర్లు వంటి వాటికి సంబంధించి అంశాలపై ప్రసంగిస్తారన్నారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఈద్గా అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయించండి

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



కబ్రస్థాన్ శుభ్రం చేసేందుకు పనులు ప్రారంభించిన జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

ఈద్గా మరింత అభివృద్ధి చేయాలనీ, ఈద్గా అభివృద్ధికి వినుకొండ పురపాలక సంఘం నుండి రూ. 40 లక్షలు నిధులు కేటాయించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీని యర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు మునిసి పల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తిమ్మాయ పాలెం రోడ్డులోని కబ్రస్థాన్ శుభ్రం చేసేందుకు రూ.5 లక్షలతో పరిపాలక సంఘం చేపట్టిన పనులను చీఫ్ విప్ జిబి ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించే ఈద్గా అభివృద్ధి చేయాలని ముస్లిం పెద్దలు తమకు విన్నవించారని తెలిపారు. ఈద్గా నిర్మా ణం పనులకు సంబంధించి ముస్లిం సోదరు లతో కలిసి సగం నిధులు శివశక్తి ఫౌండేషన్ అందిస్తుందని వెల్లడిం చారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమా నికి పెద్దపీట వేసిందని అన్నారు. ఉర్దూ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుం దన్నారు. ముస్లిం మైనారిటీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి పని చేస్తున్న కూటమి ప్రభుత్వా నికి ముస్లిం సోదరులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిష నర్ సుభాష్ చంద్రబోస్, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుఖాన్, చెరుకుంపాలెం షమీం, పివి సురేష్ బాబు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

16న అమరవీరుల సంస్మరణ సభ

జయప్రదం చేయాలని సిపిఐ నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఈనెల 16వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వార్షికోత్సవం అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలను జయ ప్రదం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్య దర్శి కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ తెలిపారు. శుక్రవారం విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన పెదకూరపాడు సిపిఐ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ పరిష్కరించుకొని మాజీ శాసనసభ్యులు దర్శి లక్ష్మయ్య, అంబటి హనుమంతరావు,దర్శి పాణకాలరావు, చిన్నప్ప మాస్టారు స్మారక స్థూపాలు జెండా ప్రతిష్టలు రైల్వే స్టేషన్ రోడ్డు వాటర్ ట్యాంకి వద్ద బహిరంగ సభ నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. రైతుసంఘం నాయకులు ముసులూరి రమేష్, నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు మాట్లా డారు.అనంతరం ప్రజానాట్యమండలి దళంతో సంస్కృతి కార్య క్రమాలు నియోజవర్గం సిపిఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఎస్పీ దంపతులను సన్మానిస్తున్న అర్చకులు

అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - దుర్గి

అడిగోప్పల శ్రీ నిదానంపాటి అమ్మవారిని శుక్రవారం పలనాడు జిల్లా ఎస్పీ కంటి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఎస్పీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు ఎస్పి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలు నడుమ ఎస్పీ దంపతులకు శాలువా కప్పి అమ్మవారి జ్ఞాపకలు అందజేసి ఆశీర్వదించారు కార్యక్రమంలో యాగంటి వెంకటేశ్వర్లు గురజాల డిఎస్పి. బి జగదీష్ ఆలయ సూపరింటెండెంట్ కోన వెంకట శివప్రసాద్. ఎస్ఐ సుధీర్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి అభిషేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

అయ్యప్పస్వామి పుట్టినరోజు పూజల్లో ఎమ్మెల్యే జూలకంటి


ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

శ్రీ అయ్యప్ప స్వామి పుట్టిన రోజు పర్వదినాన్ని పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని సౌసైటి కాలనీలోని శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఏటా గురుస్వామి సింగం గణపతిశర్మ ఆధ్వ ర్యంలో నిర్వహించే అయ్యప్ప పుట్టినరోజు పూజా కార్యక్రమాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొని విశేషాలంకరణలో ఉన్న స్వామికి ఎమ్మెల్యే జూలకంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచా మృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ టిడిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో ఏఎంరెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ కెవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పూఫ్స్ యూటో రియా 2 కె 25 క్రీడా విభాగంలో తమ కళాశాల విద్యా ర్థులు కబడ్డీలో ప్రతిభచాటి ప్రథమ స్థానంలో నిలిచారని ఏఎంరెడ్డి మెమోరియా స్మారక కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను నరసరావుపేట మండలం పెట్లూరివారి పాలెం గ్రామ పరిధిలోని కళాశాలలో ఏర్పా టు చేసిన సభలో అభినందించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీని వాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా విభాగంలో 25 కబడ్డీ జట్లు తలపడగా తమ కళాశాల ఫార్మసీ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడల వల్ల విద్యార్థుల మానసిక ఉల్లా సం, శరీరదారుఢ్యం మెరుగుపడతాయన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పిడి సందీప్, కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ పి. భార్గవ్ భూషణ్ రావు, డాక్టర్ ఎం. లక్ష్మీ సురేఖ, ఫిజికల్ డైరెక్టర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తోటి విద్యార్థులు అభినందించారు.



కబడ్డీలో ప్రతిభ చూపిన క్రీడాకారులు

పాఠశాలకు పూర్వ విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహం వితరణ



సరస్వతిదేవి విగ్రహాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం యలమంద గ్రామ జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యనభ్యసించిన పూర్వ విద్యా ర్థులు పాఠశాలలకు సరస్వతీ దేవి విగ్రహాన్ని వితరణ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.పార్వతి, పూర్వ ప్రధానోపాధ్యాయులు హనుమంత రావు, గ్రామ నీటి సంఘం అధ్యక్షులు చంద్రన్న ఆధ్వర్యంలో విగ్రహాన్ని షేక్ నబీ బాజీ, వీరాంజనేయులు, కడియాల నాగేశ్వర రావు,మానుకొండ నాగేశ్వరావు, పాటిబండ్ల రవీంద్ర, పొట్టి వెంకట పుల్లారావు, కొలిమిర్ల నాగరాజు, నాగ సరపు కుమారి, సుమతి పాల్గొన్నారు. కడియాల వీరయ్య చౌదరి కడియాల కిరణ్ కుమార్ చౌదరి తమ తండ్రి జ్ఞాపకార్థం డైనింగ్ హాలు నిర్మించారు.

ప్లాస్టిక్ నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - వినుకొండ

పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్లాస్టిక్‌ను ప్రజలందరూ నిషేధించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు కోరారు. వినుకొండ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల హర్ష స్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని,100 మైక్రోన్ ఉన్న ప్లాస్టిక్ భూమిలో కరగక పోవటంతో కాలుష్యం పెరుగుతుందని, తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్య పాలవడం, ఆవులు మరణిస్తు న్నాయన్నారు. వినుకొండ ప్రాంతంతో పాటు పల్నాడు జిల్లాలో వ్యాపారులందరూ ప్లాస్టిక్ విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కూటమి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామప్ప దేవాలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు

అమ్మవార్లకు సారె సమర్పించిన భక్తులు

ప్రజాశక్తి - మాచర్ల :

పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక శ్రీ రామప్ప దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. 15వ వార్డులోని పోలా పద్మావతి ఇంటి వద్ద నుండి మేళ,తాళాలతో, గోవుతో కలిసి భక్తులు శ్రీ గంగా, పర్వతవర్ధనీ అమ్మవార్లకు సమర్పించే సారెకు చెందిన వివిధ వస్తువులతో ఊరేగింపుగా శ్రీ రామప్ప దేవాలయా నికి చేరారు. శ్రీరామప్ప దేవాలయంలో స్వామి, అమ్మ వార్లకు ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వ హించి, అమ్మవార్లకు కుంకుమ పూజ చేశారు. అనంతరం అమ్మవార్లకు సారె సమర్పించారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో కంభంపాటి యల్లమంద, పోలిశెట్టి చంద్రశేఖర్, షరాబు వెంకటరత్నం, తుమ్మేపల్లి సత్యనారాయణ, తుమ్మేపల్లి అంకేశ్వరరావు, మంజుల, కొత్త సుబ్రమణ్యం, కుమారి, సాంబశివరావు, దారివేముల రామారావు, ఓబులశెట్టి వాసు, శివపార్వతి, శ్రీలత, ప్రమీలా, ఉషారాణి, అనూష, అరుణ, ధనలక్ష్మీ, సుధ, పుష్పవతి పాల్గొన్నారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తలకు గాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి నరస రావుపేట లోని ఆయన స్వగృహంలో గురువారం స్నానం చేసేం దుకు వెళుతుండగా కాలు జారీ పడిపోవడంతో తలకి గాయం అయింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. నరసరావుపేట మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గాయానికి 8 కుట్లు వేశారు. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

టిడిపి పాలనలో గిరిజన తండాల అభివృద్ధి

హోలీ వేడుకల్లో చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

గత టిడిపి పాలనలోనే గిరిజన తండాల అభివద్ధి జరిగిం దని ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజ నేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డు లోని సేవాలాల్ సంత్ మహారాజ్ గుడి వద్ద శుక్రవారం జరిగిన హోలీ వేడుకల్లో చీఫ్‌విప్ జీవి పాల్గొన్నారు. సుగాలి సోదరు లతో కలిసి హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపు కున్నా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లా డుతూ 2014-19 టిడిపి హయాంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. బొల్లాపల్లి మండలంలో గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్క రిస్తామన్నారు. ఆర్.ఎస్.ఆర్‌కు పైబడిన భూముల్లో ఎంతో మంది ఎస్సీ ఎస్టీ బీసీలు సాగు చేసుకుంటూ జీవనం సాగి స్తున్నారని, వారికి భూమి హక్కు పట్టాలు లేవని, అర్హులైన వారందరినీ గుర్తించి ఆరు నెలల్లో పట్టాలు ఇప్పిస్తామని తెలి పారు. కూటమి ప్రభుత్వం సూర్యకాంతి పథకం ద్వారా సోలార్ విద్యుత్ సౌకర్యం తీసుకువచ్చి ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్తును ఇవ్వనున్నట్లు తెలిపారు. జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. హోలీ జరుపుకుంటున్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మాణానికి తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి నాయకులు నాగేశ్వర రావు, పివి సురేష్‌బాబు, కూటమి నాయకులు, సుగాలి పెద్దలు పాల్గొన్నారు.



మిరప తోటను పరిశీలిస్తున్న ఆర్.కె. యాదవ్

మిర్చి రైతుకు సకాలంలో సాగునీరు ఇవ్వండి : ఆర్కే

ప్రజాశక్తి - అమరావతి

మిర్చి పంటకు సాగునీరు ఎంతో అవసరమని తెలుగు జనసేన సమితి అధ్యక్షులు ఆర్.కె. యాదవ్ అన్నారు. గురు వారం ఆయన పలు మిరప తోటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా నీటిని సకాలంలో వదిలి మిర్చి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీరు లేక మిరప తోటలు ఎండు ముఖం పట్టాయని కాయల్లో నీటి శాతం తగ్గిపోయిందని తోటలు వడ బడి పోతున్నాయని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ మాచర్ల డిఎం కార్యక్రమం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

మాచర్ల ఆర్టిసి డిపో నందు శనివారం డయల్ యువర్ మాచర్ల డిఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి తెలిపారు. స్థానిక డిఎం కార్యాల యంలో శుక్రవా రం డిఎం వీరస్వామి విలేకరుల తో మాట్లాడుతూ మాచర్ల పరిసర గ్రామ ప్రజలు, ప్రయాణికులు వారి గ్రామాలకు సంబంధించిన బస్సుల విషయంలో సమ స్యలు, సూచనలు సలహాలను 9959225432 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. కార్యక్రమం ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిర్వ హిస్తున్నట్లు డిఎం తెలిపారు.



దుగ్గిరాల పోలీస్ స్టేషన్లో భద్రపరుస్తున్న పరీక్ష పత్రాలు

మండల కేంద్రానికి చేరిన 10వ తరగతి పరీక్ష పత్రాలు

ప్రజాశక్తి దుగ్గిరాల

సోమవారం నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని మండల విద్యాధికారి కె.లక్ష్మీనారాయణ తెలిపారు. దుగ్గిరాలలో రెండు ఈ మని పెదపాలెం రేవేంద్రపాడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 552 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. సోమవారం ప్రారంభమైన పరీక్షలు ఈనెల ఆఖరికి ముగుస్తాయి. పరీక్ష పత్రాలు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్కు చేరాయి విద్యా శాఖ అధికారుల సమక్షంలో పత్రాలను భద్రపరిచారు. శనివారం రెండో సెట్ పరీక్ష పత్రాలు వస్తాయని ఎంఈఓ తెలిపారు.



మరణించిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పలు కుటుంబాలకు ధూళిపాళ్ల పరామర్శ

ప్రజాశక్తి చేబ్రోలు

ధూళిపాళ్ళ చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, గొడవర్రు, మంచాల గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు భావనవేణు, ఆరుమల్ల ముక్కోటి, చిమట సీతారామయ్య మరణించిన విషయాన్ని తెలుసుకున్న టిడిపి నాయకులు శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సాను భూతి తెలిపారు.

మహిళా నాయకురాలు సువార్తకు నివాళి

ప్రజాశక్తి తెనాలి

మహిళల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి వేముల సువార్తమ్మ అని ప్రజానాట్యమండలి తెనాలి శాఖ అధ్యక్షుడు మాణిక్యాలరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రజానాట్యమండలి నాయకులు వేము సువార్తమ్మ సంస్మరణ సభ స్థానిక గాంధీనగర్ ఇస్కస్ కార్యాలయంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రజానాట్యమండలిలో ఎంతో కీలకంగా పనిచేసిన సువార్తమ్మ పోరాట పటిమను వివరించారు. కార్యక్రమంలో ఇస్కస్ రాష్ట్ర ఉపాధ్య క్షులు బొల్లి ముంత కృష్ణ, ప్రజానాట్యమండలి బృందం పాల్గొన్నారు. తొలుత సువార్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

రోడ్ల అభివృద్ధికి రూ.105 కోట్లు మంజూరు

ప్రజాశక్తి చేబ్రోలు

చేబ్రోలు మండలంలోని శేకూరు, వీరనాయ కునిపాలెం, శలపాడు, వడ్లమూడి, వేజండ్ల, నారా కోడూరు గ్రామాలకు రూ.1.05 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలుగుదేశం మండల కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. గత వైసిపి ప్రభుత్వ హయంలో పైగ్రామాలలోని రోడ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చొరవతో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కులను లబ్ధిదారులకు పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారాని 18న పెన్షనర్ల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న కెబి ప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గుంటూరులో రీజినల్ ఈపీఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపిఆర్ఏ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక చించుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడారు. మార్చి 18న గుంటూరులో జరనున్న ధర్నాలో పెన్షనర్లు పడుతున్న సమస్యలపై గొంతు విప్పాలన్నారు. 1995లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పెన్షన్ స్కీం కార్మికులకు నష్టదాయకమని తెలిపారు. ప్రతినెలా కార్మికుల జీతంలో 8.33శాతం మినహాయించుకొని ఈపీఎఫ్ సంస్థ దానిపై వచ్చే వడ్డీ కన్నా తక్కువ పెన్షన్ ఇస్తుందని తెలియజేసారు. కనీస పెన్షన్ నెలకు రూ 9 వేలు, ఆరు నెలలుకోసారి విడిఎ, కుటుంబ వైద్య సౌకర్యం, ప్రయాణ చార్జీల్లో రాయితీ, అన్ని సంక్షేమ పథకాలు అమలు, పూర్తి జీతానికి పూర్తి పెన్షన్ లెక్క కట్టి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపిఆర్పిఏ జిల్లా కమిటి ప్రెసిడెంట్ కె.శివశంకరరావు, కుర్రా రమణ షేక్ హుస్సేన్ వలి, కె దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 12.00 గం.లకు నిర్వహించిన స్వామి వారి కల్యాణమహోత్సవంలో విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ప్రభుత్వం తరపున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు.

ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అంద జేశారు. కర్లపాలెం పద్మావతి మెమోరియల్ సేవ సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి మిద్దె సెంటర్లో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు, రవ్వ కేసరి, మంచినీళ్ల పంపిణీ చేశారు. స్థానిక సగర భగీరథ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తు లకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు నరసింహారావు, దుర్గారావు, కటారి నాగరాజు, నక్కా మహేష్, గోపి, నక్కా కష్ణ, గండికోట మోహన్, భగీరథ యూత్ సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్, రాజేష్, వెంకటేష్, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న లోకేష్ దంపతులు

వెంకటపాలెంకు 300 బస్సులు ఏర్పాటు

ప్రజాశక్తి - తుళ్లూరు



ఆలయం వద్ద సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాజధాని అమరావతి ప్రాంతం, మండలంలోని వెంకటపాలెంలో శనివారం సాయంత్రం జరుగనున్న శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని 27వేల మంది భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు టిటిడి ఈవో జె శ్యామలరావు వెల్లడించారు. శుక్రవారం ఆలయం క్యాంపు కార్యాలయంలో టిటిడి అధికారులు,జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వ హిం చారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యా యని టిటిడి ఈవో వెల్లడించారు. సిఆర్డి ఎ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టిటిడి సుమారు 300 బస్సులను ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. పుష్పాలంకరణ చేసేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయని, దాదాపు నాలుగు టన్నుల ఫ్లవర్స్, 30వేల క్లట్ ఫ్లవర్స్,ఆలయంలో మామిడి,అరటి, టెంకాయ తోరణాలతో అలంకరించనున్నట్లు చెప్పారు. కళ్యాణోత్స వానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు,కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కంకణాలు, శ్రీవారి పుస్తక ప్రసాదం, కల్యాణోత్సవం అక్షింతలు కలిపి ఒక బ్యాగ్లో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.18 ఎల్ఈడీ స్క్రీన్ లు, దశావతారాలు, వేంకటేశ్వరుడు, శ్రీ పద్మావతీ అమ్మవార్ల కటౌట్లు, ఆలయం పరిసరాలలో 60 తోరణాలతో పాటు వేంక టేశ్వర ఆలయంలో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జెఈవో వివీరబ్రహ్మం, టిటిడి సివి ఎస్వో హర్షవర్ధన్ రాజు, ఎస్పీ సతీష్కుమార్, సిఈ సత్యనారాయణ, టిటిడి అధికా రులు పాల్గొన్నారు.

సారా రహిత రాష్ట్రమే నవోదయం 2.0 : ఎక్సైజ్ డిసి

ప్రజాశక్తి తెనాలి

సారా రహిత రాష్ట్రమే ధ్యేయంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలో బార్ షాపులు, ఎ4 షాపుల లైసెన్సుల యజమానులతో తెనాలి కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీ, విధి విధానాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గుంటూరు, పల్నాడు పరిధిలో మాచర్ల, నరసరావుపేట, క్రోసూరు, ఈపూరు, పిడుగురాళ్ల, గురజాల గ్రామాలను సారా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా రాష్ట్ర స్థాయి కమిటీలు ద్వారా నాటు సారా నిర్మూలనకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామస్థాయి కమిటీలో సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ సెక్రెటరీ, స్థానిక ఎక్సైజ్ అధికారి, మహిళా సంఘాలు, మండల స్థాయి కమిటీలో తహశీల్దార్, ఎంపిడివో, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ఎస్సై, ఎఫ్ఆర్వో, జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్, ఎస్పి, జిల్లా ఎక్సైజ్ అధికారి, అటవీ శాఖ అధికారి ఉంటారని చెప్పారు. వ్యవస్థీకత నేరా లకు పాల్పడిన వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. బార్షాపుల యజమానులు, ఏ4 షాపుల లైసెన్స్ దారులు ఆరుబయట తాగే వారిని ప్రోత్సాహించ కూడదన్నారు. ఇటీవల బహిరంగంగా మద్యంసేవిస్తున్న 96 మంది పై కేసులు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కె అరుణకుమారి, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇఎం బాబు, తెనాలి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ వెంకటాచలం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిసి డాక్టర్ కే శ్రీనివాసరావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఎడ్ల బల ప్రదర్శనకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న ఎడ్లబల, పాడి గేదెలు పాల ప్రదర్శన ఏర్పాట్లను కష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఆలపాటి శివరామ కృష్ణయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మార్చి 29 నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్న ఏర్పాట్లపై ఆలపాటి పలు సూచనలు చేశారు. ప్రేక్షకుల సందర్శనార్థం ఏర్పాటు చేయబోతున్న గ్యాలరీలతోపాటు, పాల ఉత్పత్తుల ప్రదర్శనకు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ పట్ల జాగ్రత్తలు వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న కూరపాటి స్టీవెన్

సమస్య పరిష్కరించటం ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి- తాడేపల్లి

వందలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 101వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.వి మోహన్రావు, సిహెచ్ పిచ్చయ్య, ఆర్ ఇస్రాయెల్, కె ఆదినారాయణ, ఎం గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండనక, వాననక 100 రోజులు పైబడి కార్మికులు దీక్షలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ స్పందించక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, డి మాణిక్యరావు, బి.అంకయ్య, వై.సాల్మన్, వై యెహోషువ, ఎస్ కె సుభాని, వైసుబ్బారావు, ఎండి రహీం తుల్లా, సాంబయ్య, టి దుర్గ భవాని, వై రమాదేవి, ఎస్.కె ఇమాంబి, ఈ సారమ్మ, ఎం శివకుమారి, వి రిబ్కా, డి మల్లేశ్వరి, ఎస్ శాంతమ్మ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు వినియోగం కంటే గొప్పది

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

యూనిట్ విద్యుత్ పొదుపు, యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కంటే గొప్పదని, రోజు వారీ జీవితంలో అత్యవసరమైన విద్యుత్ ని సమర్ధవంతంగా వినియోగించుకుంటే బిల్లు తగ్గటంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కెఎల్ యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో కెఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సీఎస్ఈ హానర్స్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, నిర్వహణ అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్ఈడీ బల్బులు, ఇన్వర్టర్ టెక్నాలజీ ఉన్న 5 స్టార్ రేటింగ్ ఉన్న గహోపకరణాల వినియోగం, అవసరంలేనిచోట ఫ్యాన్లు, లైట్లు, టీవీలు, ఏసీ, కూలర్లు ఆఫ్ చేసి సూర్యకాంతి వినియోగించటం ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చునని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ అథితన్ అభినందించారు.

టిడ్కో ఇళ్లకు తక్షణమే తాగునీరు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి తాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ అడవితక్కెళ్ల పాడులోని టిడ్కో గృహ సముదాయాలను జిఎంసి, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులు, ప్రజలు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడులోని టిడ్కోఇళ్లల్లో షుమారు 13 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారని, సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం త్రాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ, రేషన్ పంపిణీని ప్రజలకు చేరువగా అందించాలని సచివాలయ కార్యదర్శులను, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు, జిఎస్బి రోడ్ల ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈలు శ్రీనివాస్, సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డాక్టర్ దక్షిణామూర్తికి రాజారామ్ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు



అభ్యుదయ సాహితీవేత్త, అరసం నాయకులు డాక్టర్ పరుచూరి రాజారామ్ జ్ఞాపకార్థం 2003 నుంచి ఆయన జయంతిని పురస్కరించుకొని అందజేస్తున్న సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది తెనాలికి చెందిన వైద్యులు, పాపులర్ సైన్స్ రచయిత డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి అందచేస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగా ఒక ప్రకటనలో తెలియచేశారు.మార్చి 18న సాయంత్రం 6గంటలకు గుంటూరు బృందావన్‌గార్డెన్స్ 5వ లైన్‌లోని డిస్ట్రిక్ట్ సీనియర్ సిటిజన్స్ సర్వీసు ఆర్గనైజేషన్ ప్రాంగణంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగే సభలో డాక్టర్ దక్షిణామూర్తికి రూ.10వేల నగదు, జ్ఞాపికతో రాజారామ్ కుమార్తె పరుచూరి అజిత సత్కరిస్తారన్నారు. వైద్య రంగంలో సాహిత్య సాంస్కృతిక రంగాల్లో తెనాలి కేంద్రంగా డెబ్బై సంవత్సరాలుగా కృషి చేస్తున్న డాక్టర్ దక్షిణామూర్తి 1939లో సెప్టెంబర్ 2న కృష్ణాజిల్లా గుంటుపల్లి గ్రామంలో జన్మించారని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ తెలిపారు. సాధారణ ప్రజలకు వైద్య విజ్ఞానం అర్థమయ్యే రీతిలో వివిధ పత్రికలలో వందలాది వ్యాసాలు రాశారన్నారు. జీవశాస్త్రం, విజ్ఞానం, డాక్టర్‌గారి డైరీ, వైద్య విజ్ఞానం, డయాబెటీస్ గైడ్ తెలుగులో ఉత్తమ చిత్రాలు, గుండె జబ్బులు నివారణ మొదలైన పుస్తకాలు రచించారన్నారు. తెనాలి ఐఎంఎ కార్యదర్శిగా సేవలు అందించారని, 2015లో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం, 2016లో ఇండియన్ కాలేజి ఆఫ్ ఫిజీషియన్స్ నుండి ఫెలోషిప్ స్వీకరించారన్నారు. 2017లో విజయవాడ రూట్సు ఫౌండేషన్ వారి నుండి జీవితకాల సాధన అవార్డు పొందారని తెలిపారు.



షార్‌ను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

షార్‌ను సందర్శించిన ఫాతిమా విద్యానికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని ఫాతిమా విద్యానికేతన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు 120 మంది చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతరిక్ష కేంద్రం షార్‌ను సందర్శించారని స్పేస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి తెలిపారు. విద్యార్థులకు అంతరిక్ష కేంద్ర సందర్శనతో ఎంతో ఆసక్తి, అవగాహన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు, ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీలకు, యూనివర్సిటీలకు సంబంధించిన విద్యార్థులను గత దశాబ్ద కాలంగా అంతరిక్ష కేంద్ర సందర్శనకు పంపుతున్నామన్నారు.విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై జ్ఞానాన్ని పెంపొందించడమే మా లక్ష్యమని చెప్పారు.

విద్యారంగం - ఆర్థిక సమస్యలపై ఎంబివికెలో రేపు రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

విద్యారంగం, ఆర్థిక సమస్యలపై ఈనెల 16న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ ఆఫీసులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఉండేలాగా చూడాలని, అదేవిధంగా మిగిలిన ప్రాథమిక పాఠశాలల్ని యథావిధిగా కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించాలని కోరారు. పెండింగ్ డిఎలు ప్రకటించాలని కోరారు.సదస్సులో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, ఎండి.షకీలాబేగం, బెల్లంకొండ ప్రసాదు, ఆడిట్ కమిటి సభులు ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులపై కొరడా

- గుంటూరులో 11 సంస్థలకు తాళం
- బుడంపాడు జివిఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల సీజ్





పన్నులు చెల్లించని సంస్థలకి తాళం వేస్తున్న కార్పోరేషన్ అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం కొరఢా ఝుళిపించారు. గుంటూరులో 11 ప్రముఖ సంస్థలను సీజ్ చేశారు. చాలా కాలం నుంచి బకాయిలు చెల్లించని వారికి ముందుగా డిమాండ్ నోటీసుల పంపిణీ చేశామన్నారు. అయినప్పటికీ కొందరు మొండి బకాయిదారులు ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అటువంటి వారి ఆస్తులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. 2021 నుండి పన్ను చెల్లించని బుడంపాడులోని జివిఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కాలేజి (రూ.27,44,695), శ్రీనివాసరావుతోటలోని రుచి గ్రాండ్ (రూ. 20,69,54), రెడ్డి కాలేజీ (రూ. 24,20,873), ప్రభాకరరెడ్డి చిల్లీస్ (రూ.3,26,534) లక్ష్మీశెట్టి రమణమ్మ షాప్ (రూ. 8,84,737) విష్ణు ప్రియ కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ 80 (రూ. 77,631), లిబర్టీ థియేటర్ (రూ. 21,59,886), అరండల్ పేటలోని చలపతిరావు షాప్ (రూ.32,25,528), గోరంట్లలోని జనని హోమ్స్ (రూ.5,99,000), బ్రాడీపేట 3,4వ లైన్ ల్లోని 2 కమర్షియల్ కాంప్లెక్స్ లను సీజ్ చేశామని తెలిపారు. అలాగే పన్ను చెల్లించని 162 నివాసాలకు ట్యాప్ కనెక్షన్ తొలగించామని తెలిపారు. పన్ను చెల్లించని వారి అస్తుల సీజ్, ట్యాప్ ల తొలగింపు కొనసాగుతుందని, పన్నులు చెల్లించి నగరాభివద్ధికి సహకరించాలని కోరారు. ఆస్తి పన్ను చెల్లింపునకు ఎటువంటి గడువు లేదని, ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ కూడా లేనందున బకాయిదారులందరూ వెంటనే చెల్లించాలని, లేకుంటే వారి ఆస్తుల సీజ్ తప్పదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్లు ఎంతో కీలకమని, బకాయిదారులు పన్నులు చెల్లించకుంటే నగర అభివృద్ధిపై ప్రభావం ఉంటుందన్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

ప్రజాశక్తి-గుంటూరు



ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న భాష్యం రామకృష్ణ

రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం గోరంట్ల టెన్త్ క్యాంపస్‌లో ఛైర్మన్ రామకృష్ణ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఆరోగ్యంగా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అరబిక్ ప్రొఫెసర్ మహ్మద్ ఇషాక్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకష్ణ పాల్గొన్నారు. అనంతరం ఛైర్మన్ రామకష్ణ చేతులమీదుగా ఇఫ్తార్ విందును ప్రారంభించారు.కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్‌ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, యండి భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.


చోరీ కేసుల్లో 8 మంది అరెస్టు

రూ.16.12 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎనిమిది చోరీ కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రూ.16.12 లక్షల విలువైన సొత్తును తెనాలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏడుగురు నిందితుల నుంచి 162 గ్రాముల బంగారం, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తూ దొంగతనాలు చేస్తున్నా చాలా కాలంగా వీరంతా తప్పించుకుని తిరుగుతున్నారు. వ్యసనాలు, సరదాలు, జల్సాల కోసం వీరు మహిళల నుంచి చైను దొంగతనాలకు పాల్పడుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం జరిగిన కేసులను కూడా ఎంతో నేర్పుగా చేదించి దొంగిలించిన ప్రతి గ్రామమును కూడా రికవరీ చేసిన తెనాలి త్రీ టౌన్ సిఐ రమేష్ బాబు, ఎస్సైలు ప్రకాష్ రావు,కరీముల్ల వారి సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. చినరావూరు తోటకు చెందిన పోతర్లంక సాయి మాధవ్, మహమ్మద్ సమీర్, షేక్ మాగ్బుల్, ధనావత్ హనుమంత్ నాయక్, సయ్యద్ కరిముల్లా, షేక్ బారావలిఏ బారాతో పాటు కొల్లిపర మండలం అన్నవరం ప్రాంతానికి చెందిన అమర్తలూరి నానిని అరెస్టు చేసినట్టు ఎస్‌పి వివరించారు. నిందితులు మహిళల నుంచి బంగారు ఆభరణాలను దొంగిలించి వెంటనే మరొక ద్విచక్ర వాహనంపై పారిపోవడం ఒక పథకంగా ఎంచుకున్నారని తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. అదనపు ఎస్‌పి కె.సుప్రజ, డిఎస్‌పి జనార్ధనరావు పాల్గొన్నారు.







తెనాలిలో చోరీ కేసులో నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చిన ఎస్.పి సతీష్ కుమార్